
# మేడిపిడి



"నిజం చెప్పావో నీ గతి కూడా అంతే! నువ్వు పద్నాలుగో వాడవడం మాత్రం ఖాయం. బాగా ఆలోచించుకో!"

ఆ రైల్వేస్టేషన్‌లో అసిస్టెంటు స్టేషన్ మాస్టర్లు... గూడ్స్ క్లార్కులు... పార్సెలు క్లార్కులు... బుక్కింగ్ క్లార్కులు కడకు పోర్టర్లు- ఎవరి నోట విన్నా ఇదేమాట! ప్రతిగొంతులో చిగురిస్తున్న సందేహం పాట!

అప్పటికి నేను రైల్వేలో చేరి పట్టుమని పది నెలలు కాలేదు.

నా తరువాత పదిరోజులకు సర్వీస్‌లో చేరినవాడు- అదే మాట అంటున్నాడు. నాకు పది సంవత్సరాల ముందు చేరినవాడు అదే మాట అంటున్నాడు.

ఎవరి మాట వినాలో? ఎవరి మాట వినకూడదో? ఏం చేయాలో? పరిణతి చెందని వయస్సుకు ఒక ప్రశ్నార్థంగానే మిగిలింది.

"ఈ రోజుల్లో సెంట్రల్ సర్వీస్ అంటే మాటలు గాదు. ఏదో అదృష్టం కొద్దీ ఇంత చిన్న వయసులోనే సంపాదించుకొన్నావ్. న్యాయం... ధర్మం... అని పిల్లతరహాగా ఆలోచించావంటే– సత్యానికి పోతే భత్యానికి లేకుండా పోతుంది. తరువాత నీ ఇష్టం. బాగా ఆలోచించుకో!"

అందరూ నా శ్రేయస్సు కోరే చెప్తున్నారు. అయితే–

'నిజం చెప్పడానిక్కూడా ఆలోచించుకోవాలా?– 'ఇదే నన్ను రాత్రింబవళ్ళు వేధిస్తున్న ప్రశ్న.

స్కూలు ఫైనల్ పరీక్షలో అడిగిన ప్రశ్నలకు అద్భుతంగా సమాధానాలు రాశాను. 'కృతార్థుడయ్యావు. పో!' అన్నారు.

రైల్వేలో అధికారులు గంట వ్యవధి ఇచ్చి ప్రశ్నలకు సమాధానాలు రాయమంటే అర్థగంటలోనే పూర్తిచేశాను. ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలకు వెనకాముందాడకుండా చాలా ధైర్యంగా బదులు చెప్పాను. ఉద్యోగం ఇచ్చాం. చేసుకో!' అన్నారు.

"రైల్వేలో ఉద్యోగమా? నీ జన్మమే చరితార్థమైపోయింది. పో!" అని స్నేహితులు వెన్ను తట్టారు. పెద్దలు ఆశీర్వదించారు.

ఎకాఎకిని ఎలా చేరాను? టిక్కెట్టు కొనకుండా రైల్వేవాళ్ళు ఇచ్చిన 'పాస్' ఆధారంగా రైలెక్కాను. అప్పటి ఆనందం– తిరుమల కొండమీద మా పెదబావగారు దేవస్థానంలో ఉద్యోగం చేస్తూ ఉండేవారు. స్కూలు సెలవులు గడపడానికి నేను కొండెక్కేవాడిని. ఆ సమయాల్లో ఆయన నన్ను అప్పుడప్పుడు సరదాగా ఏనుగుమీద ఎక్కించేవారు. అప్పుడుకూడా అంత ఆనందం పొందలేదు.

పట్టుమని పది నెలలు గడవకముందే ఆ ఆనందానికొక పరీక్ష!

నిజం చెప్పాలా? వద్దా! అన్నదే ఆ పరీక్ష.

పరీక్షల్ని అవలీలగా దాటేసిన నాకు ఇదొక విషమ పరీక్షగా దాపురించింది. నిజం చెప్తే నేను పద్నాలుగో వాడవుతానంటున్నారు. అంటే– అప్పటికి ఆ స్టేషన్‌లో అయిదేండ్ల నుండి పని చేసినవాళ్ళు... ప్రస్తుతం చేస్తునవాళ్ళు... మొత్తం పదమూడు మంది 'సస్పెండ్' అయ్యారు. నిజం చెప్తే నేను 'సస్పెండ్' అవుతానట. అప్పుడు 'సస్పెండ్' అయినవాళ్ళ వరుసలో నేను పద్నాలుగో వాడవుతాను. కావాలనుకొంటే నిజం చెప్పాలి. కాకూడదనుకొంటే అబద్ధం చెప్పాలి!–

నిజం చెప్పినా... అపద్ధం చెప్పినా... ఫలితం నా ఒక్కడికే పరిమితమైతే ఫరవాలేదు. నేను ఇచ్చే వాఙ్మూలంతో మరొక ఉద్యోగి భవిష్యత్తు కూడా ముడిపడి ఉంది. అతడి పేరు పాషా. అప్పటికే అతడు 'సస్పెన్షన్'లో ఉన్నాడు.

నేను నిజంచెప్తే అతడిఉద్యోగం నిలబడుతుంది.

నేను అబద్ధంచెప్తే నా ఉద్యోగం నాకు దక్కుతుంది.

చాలా జాగ్రత్తగా ఆలోచించవలసిన విషయం. అయితే అది ఆలోచించే వయస్సా? కాదు. రెండు పదుల వయస్సు దాటలేదు. పిల్లిబొచ్చులాగా ఏర్పడీ ఏర్పడిని మీసకట్టును చూసి 'ఈ పిల్లనాయాలి కెలావొచ్చిందీ ఉద్యోగం?' అని ఎగతాళికి గురి అవుతున్న రోజులు. ఆ వయస్సులో స్వార్థానికి, పరహితార్థానికి మధ్య అంతర్యుద్ధం తట్టుకోలేక నా చిన్ని గుండె తల్లడిల్లిపోతూ ఉంది.

విచారణ రోజు నిర్ణయమయింది.

'ఏం నిర్ణయించుకున్నావ్?' అని ఎవరైనా అడిగితే ఏదైనా నిర్ణయించుకొని ఉంటే గదా చెప్పడానికి?– ఏమీ చెప్పలేని స్థితిలో నీళ్ళు నములుతున్నాను.

నా నిస్సహాయ స్థితికి అందరూ జాలి పడుతున్నారు.

అయితే ఈ పదమూడు మందితో కలిపి నన్ను కూడా ఇబ్బందికి గురిచేసిన మూర్తి మాత్రం ముచ్చటగా ముస్తాబు చేసుకొని ముసిముసిగా నవ్వుకొంటూ తిరుగుతూనే ఉన్నాడు. అతని గుండె నిబ్బరానికి అందరు అబ్బుర పడ్తున్నారు. మనిషి ఎదుట పడ్తే ఎంతో ఆప్యాయంగా పలకరిస్తున్నారు. మరుగైతే నానా మాటలు అంటున్నారు. ఈ నాటకం ఆ వయస్సులో నాకు అర్థం కాని విచిత్రం!

ఈ విచిత్ర వాతావరణంలో ఏం చెయ్యాలో తోచకుండా నాలో నేను మల్లగుల్లాలు పడ్తూ ఉంటే–

"చూడు భయ్యా! పదహారేండ్ల సర్వీసు. అయిదుమంది బిడ్డలు. ఆస్తిపాస్తులూ ఏమీ లేవు. వాస్తవంగా జరిగిందేమిటో నీకు తెల్సు. ఏం చేస్తావో నీ ఇష్టం!" అని కనపడినప్పుడంతా పాషా బతిమాలుతున్నాడు.

'తన్నుమాలిన ధర్మం మొదలు చెడ్డబేరం!' అని చదువుకొన్న మాటలు మనస్సులో మెదులుతున్నాయి. ఆ మాట మనస్సులో మెదిల్తే మా అమ్మ కూడా మనస్సులో మెదులుతుంది. నేను ఉద్యోగంలో చేరడానికి బయలుదేరినప్పుడు–

"ఒరే అబ్బోడా! తూరుప్పరంట తెల్దు నీకు. అట్టాంటోడివి ఊరుగానూరికి పోతా ఉండావ్. ఒంటిగా ఆడెట్టుంటావో ఏఁవో? ఏదెట్టన్నా పోనీ! ఒకడి మాటకు పోబాక. ఒకడి సొత్తుకు పోబాక. మన కష్టం మనకు దక్కితే సాలు. పాణం పోతావుంటే గూడా వొకర్ని 'గబీ' మనిపించే పని మాత్రం సెయ్‌బాక!"

గెరిగిలచింతమాను దాకా దూడవెంటబడి ఆవులా నాతో కలిసి నడుచుకొంటూ వచ్చి నన్నొదిలిపెట్టలేక వెంటపడి రాలేక పెల్లుబుకుతున్న కన్నీటిని ఆపుకోలేక సతమతమవుతున్న అమ్మ గుండెను చీల్చుకొని వచ్చిన ప్రతి మాటా ప్రతిక్షణం చెవుల్లో గంట కొట్టినట్లు వినిపిస్తూ ఉంది.

"చెప్పమ్మా చెప్పు. ఈ పరిస్థితుల్లో నన్నేం చెయ్యమంటావ్ చెప్పు?– అపద్ధం చెప్తే పాషా గుండె గభీమంటుంది. చెప్పకపోతే నా గుండె గభీమంటుంది. నీ మాటకు కట్టుబడి ఉద్యోగాన్ని పోగొట్టుకోమంటావా? కాదని కాపాడుకోమంటావా? చెప్పినట్లే నడుచుకొందామంటే– నాకు తూర్పు పడమరలు తెలియవని వాపోయిన నా తల్లికి 'ఓ'కు వంపులు తెలియవు.

ఇక మా అయ్య సంగతి అనుకోవాల్సిన అవసరమే లేదు.

రైల్వేలో ఉద్యోగం వచ్చేసిందని ఊరు ఊరంతా తెగ పొగిడేస్తుంటే నా గుండె విరబూసిన చేమంతికి తోడే అయింది. ఆ ఉత్సాహంతో ఊరేగుతూ మా అయ్య దగ్గరికి పోతే–" ఏం విరా అబ్బోడా! నీకు ఉద్దోగం వచ్చిందంట కదరా?' అని అప్పటికి తానేమీ ఎరగనట్లుగా– ఎవ్వరో సంబంధంలేని మూడో వ్యక్తి అడిగినట్లుగా అడిగారు. నాకు క్షణంసేపు నోట మాట రాలేదు. కదిలీ మెదలలేక ఆయన ముందర నిలువు రాయిలా నిలబడ్తే నా గతికి జాలిపడినట్లుగా పకపక నవ్వుతూ "మనూళ్ళోకి వారానికోదినం వస్తాడే! ఎవుర్రా?" అని అడిగాడు– పదిలంగా పంచమీద వాటంగా కూర్చొని పదిరోజులకు మునుపే ఈనిన మావెర్రావు దూడమూతికి 'ముగుజింబరం' అల్లుతూ!?

ఊరన్న తర్వాత ఊళ్ళోకి ఎంతోమంది వస్తుంటారు. ప్రత్యేకించి వారానికొకసారి ఎవరొస్తారబ్బా? అని ఆలోచిస్తుంటే– 'ఈమాత్రం తెల్వోడికా రైల్వే వాళ్ళెట్లా ఉద్దోగం ఇచ్చినార్రా? అందుకేనేంవో సదిగినోడికంటే సాకలోడు మేలన్నారు పెద్దోళ్ళు!' అని నవ్వుతుంటే అప్పుడు నాలిక్కరుచుకొని, 'వారానికొకసారి ఊళ్ళో కొచ్చేది మడివేలయ్యా!' అన్నాను.

"ఊళ్ళో వాడు చేసేపనిని ఏంవంటార్రా?"

"ఉద్యోగం!"

ఆ మాట విని మా అయ్య పగలబడి నవ్వుతున్నాడు. అంటే– నా ఉద్యోగానికి ఆయన ఇచ్చిన విలువ అదన్న మాట!– నిజంగా ఆయన అల్లుతున్న 'ముగుజింబరం' నా మూతికే తగిలించినట్లయింది. నవ్వుతున్న మా అయ్య మొగాన్ని చూడలేక తలవంచుకొంటే–

"కలెక్ట్రు గాదు వాడెమ్మా మొగుడు గెవునూరైనా సరే! మేడిపిడికిందికేరా!– కయ్యాగాల ఉండాది. కాలూ, సెయ్యి బాగుండాది. రొండూ ఉండి పొయ్ ఎవుడికిందనో వొంగాలంటే– పో! వొంగుపో!"– అని తన అయిష్టతను నిక్కచ్చిగా ప్రకటించాడు.

ఈ రోజు ఆయన దగ్గరికి వెళ్ళి– "అయ్యా! పాషా అనే అసిస్టెంటు స్టేషన్ మాస్టర్ ముప్పావలా నా చేతికిచ్చి మూర్తి అనే పార్సెల్ క్లార్క్ చేతికిమ్మన్నాడు. నేను ఇచ్చేశాను. పాషా ముప్పావలా నా చేతికిచ్చిందీ నిజమే! నేను తీసుకొనిందీ నిజమే! మూర్తికిచ్చేసిందీ నిజమే!– అయితే దీనికేం రాతకోతలు లేవు. అందువల్ల మూర్తి నేను తీసుకోలేదంటున్నాడు. వాళ్ళిద్దరి మధ్య నేను సాక్షిని. నిజం చెప్తే పాషాకు ఉద్యోగం వస్తుంది. నా ఉద్యోగం ఊడుతుంది. ఏం చెయ్యమంటావయ్యా?' అని అడిగితే ఆయన వెంటనే 'ఏం వాసే!' అని మా అమ్మను

కేకేసి 'నీ కొడుక్కు ఉద్యోగం రానూ వొచ్చింది. పోనూ పొయ్యింది. రాగులిసిరి అంబిలి కాసే!' అని ఎగతాళి చేస్తాడు.

ఆ రోజే ఆయన మాట విని మడక పిడి చేతబట్టి ఉంటే– ఇప్పుడు జుట్టు ఇంకొకడికి పట్టిచ్చే ప్రమాదం తప్పేది. జరిగిపోయినదాన్ని గురించి ఇప్పుడాలోచించి ప్రయోజనం?– ఇక జరగాల్సింది ఆలోచించాలంటే ఊరు కొత్త. ఊళ్ళో మనుషులు కొత్త. ఎవరితో ఆలోచించాలో? ఏమని ఆలోచించాలో? దిక్కూ దరీ తోచడం లేదు.

రైళ్ళతో పోటీ పడినట్లుగా దినాలు దొర్లిపోతున్నాయి.

విచారణ దినం దగ్గరపడ్తూ ఉంది.

కంటిమీద రెప్ప పడకుండా రాత్రంతా మేలుకొని డ్యూటీ చేస్తాను. వెళ్ళి గదిలో పడుకొంటే కంటిమీద రెప్ప పడదు. 'పగలు డ్యూటీ' అయితే పగలంతా పని చేస్తాను. ఒళ్ళు హూనమవుతుంది. వెళ్ళి గదిలో పడుకొంటే అప్పుడూ అంతే!– రాత్రంతా కలత నిద్రే! నిజం చెప్పాలా? అబద్ధం చెప్పాలా? అని ఆలోచించడమే నా నిత్యకృత్యంగా తయారయింది. ఈ మథనపడడంకంటే– వెళ్ళి మూర్తినే బ్రతిమాల్తే! ఏమంటాడో? ఏమో?–

ఏమంటాడో? ఏమో? అని మీనమేషాలు లెక్కిస్తూ కూర్చుంటే ఏం జరుగుతుంది? ఆ పుణ్యకాలం కాస్తా సమీపిస్తుంది. ఏది జరగాలో అది జరిగిపోతుంది. అప్పుడు మళ్ళీ మా అయ్య మాటలు విననిదానికి విచారించినట్లు అప్పుడు విచారించడం కాదు– నెత్తిన చేతులు పెట్టుకొని ఏడవాల్సి వస్తుంది. ఆ ఏడ్చేదేదో మూర్తి ఎదుటపడి ఏడిస్తే సరిపోతుంది కదా? అని తోచింది. ఆలోచనా రానేవచ్చింది. వెంటనే ఆచరణలో పెడ్తే ఫలితం తెలిసి వస్తుందని ఒకరోజు మూర్తి ఇంటికి వెళ్ళాను.

మూర్తి ఇంట్లోనే ఉన్నాడు. నన్ను చూస్తూనే సాదరంగా ఆహ్వానించాడు. కుర్చీ చూపించి కూర్చోమన్నాడు. కూర్చున్నాను. కొన్ని క్షణాలు కూడా గడవలేదు. మూర్తిగారి శ్రీమతి ప్రత్యక్షమయింది. అందమైన ట్రేతో!– ఆ ట్రేలో రెండు కప్పుల కాఫీలు. పొగలు కక్కుతున్న నా గుండెతో పోటీపడి నవ్వుతున్నట్లు కనిపిస్తున్నాయి. మూర్తి ఒక కప్పును నాకందిస్తూ తానొకటి తీసుకొన్నాడు.

ఆమె లోనికి వెళ్ళిపోయింది.

మూర్తిని చూస్తున్నాను. వెళ్ళిపోతున్న ఆమెను గమనించాను. పరిసరాల్ని పరిశీలించి చూశాను. ఎక్కడా మూర్తి 'సస్పెన్షన్'లో ఉన్నాడన్న లోటు కానీ వాళ్ళలో బాధ కానీ కనిపించడంలేదు. 'ఇద్దో ఇలా అడ్డమైన గడ్డి కరిచి బాగా సంపాదించుకొన్నాడేమో?' అన్న సందేహం. ఆ సందేహంతో అసూయ. అసూయతో కోపం.

కాఫీ కషాయంలా లోనికి పోలేనంటూ మొండికేస్తూ ఉంది.

మూర్తి గ్రహించినట్లుంది.

"నామీద కోపమైతే కాఫీ ఏం చేసింది నిన్ను?"

డొంక తిరుగుళ్ళు తిరుగుతున్న మనసు ఆ మాటతో ఉలిక్కి పడింది. మాటకు మాటతోనే కొట్టే రోజులవి కావు. కాస్త తొందర తొందరగా కాఫీ తాగడం మాత్రం ముగించాను. కాఫీ ప్రభావం కావచ్చునేమో అప్పటికి ఒక మాట కుదిరింది సందర్భానికి తగినట్లుగా.

"మీమీద కోపమైతే మీతో మాట్లాడడానికెందుకొస్తాను?"

"నువ్వొస్తావని నాకు తెలుసు!"

"ఇంతమందీ రానిది నేను మాత్రం వస్తానని మీకెలా తెలుసు?"

"అంతమందిలో లేనిది నీలో ఒకటుంది."

"ఏమిటది? ధైర్యమా?"

"కాదు. నిజాయితీ!"

అదనులో పదును చినుకులు రాల్తే పరవశించే రైతు గుండె అయింది నా గుండె!– అయితే నన్ను తప్పుదారి పట్టించడానికి పన్నుతున్న వలకాదు కదా? అన్న సంశయం పొటమరిచింది.

అదే ఆలోచిస్తున్నాను.

నా ఆలోచనల్లో నేనుంటే మూర్తి బయటపడడానికి బట్టలు మార్చుకొంటున్నాడు. 'పద పోదాం!' అన్న మాట చెవిని పడేసరికి నా ఆలోచనల్లో నుండి నేను బయటపడి పైకి లేచాను.

మూర్తి ముందు. నేను వెనక. ఒకడి వెనక ఒకరుగా... మాలో మాటలే కరువైనట్లుగా నడుస్తున్నాం. మాతో కలిసి కొన్ని ఎముకల గూళ్ళు నడుస్తున్నాయి. కొన్ని ఎదురొస్తున్నాయి. నీటిబొట్టుకు కరువు... తిన తిండికి కరువైన ఈ సీమకు నకళ్ళు వాళ్ళు. మనుష్యులనబడే ఈ ఎముకల గూళ్ళు కంటపడ్తే– మా ఊరు... ఈ సీమలో మా ఊరులాంటి ఎన్నో ఊళ్ళు... ఆ ఊళ్ళలో ఎముకల గూళ్ళు కంటిముందు మెదిలేవాళ్ళు. ఆ వయస్సులోనే గుండె చెరువయ్యేది. అయినా ఏం ప్రయోజనం? ఆ గుండె రాయలసీమలో చెరువు!

ఆ గుండెలో కూడా స్వార్థం చోటుచేసుకొనింది. నన్ను గురించి నేనే ఆలోచించుకోలేని అసహాయ స్థితిలో ఉన్నాను. నోరూ కండ్లూ సలక్షణంగా ఉండీ లేని వాడిలాగా మూర్తి వెంట మూగగా నడుస్తున్నాను.

పొద్దు బాగా వాలింది.

ఊరి బయట ఆరు బయలు... తరతరాలుగా రాలని చినుకులకోసం తపించి గుండెను బీడు చేసుకొన్న బయలు... రాళ్ళూ రప్పల్తో... చిట్టిపొట్టి పొదలతో కనుచూపుమేర వ్యాపించి ఉంది. 'నీటి అలలకో పచ్చని పొలాలకో బంగారు పూతల్ని పులమవలసిన నా కిరణాల చేతులకు ఇలాంటి పరిస్థితి దాపురించిందే?' అని ఆ బయలు మీదపడుతున్న నీరెండ నిట్టూరుస్తున్నట్లుంది. పుడమితల్లి ఒంటిమీద వాచినట్లుగా పైకి లేచిన ఒక రాతిబండ. ఆ బండమీద మూర్తీ నేనూ కూర్చున్నాం.

"ఏం అడగదలచుకొన్నావో అడుగు!" అన్నట్లుగా మూర్తి నావైపు చూస్తున్నాడు. "ఇంత దూరం పిలుచుకొనివచ్చావు కదా? ఏంచేస్తావో చెప్పు వింటాను." అన్నట్లుగా మూర్తివైపు నేను చూస్తున్నాను.

మా ఇద్దరి మధ్య కొన్ని నిముషాలు– మా జోలికి రావద్దన్నట్లుగా కాలగమనంలో కలిసిపోయాయి.

మూర్తికి వయస్సు... వయస్సుకు తగిన సర్వీసు... దానికి తగిన ఓర్పూ... నేర్పూ– అన్నీ ఉన్నాయి. అయినా నా మాటకోసరమే ఎదురు చూస్తున్నట్లు స్థిమితంగా కూర్చున్నాడు. చల్లకొచ్చి ముంత దాచడమెందుకని–

"మూర్తిగారూ! మీరు చేసింది తప్పు!" అని అన్నానో లేదో?– వెంటనే మూర్తి "అవును తప్పే చేశాను!" అన్నాడు నిస్సంకోచంగా.

"అదే అడుగుతున్నా. ఎందుకు చేశారు? అని."

"డబ్బు అవసరమయింది కాబట్టి!"

"డబ్బు అవసరం మీకొక్కరికే కాదు. ఈ లోకంలో ఎవరి అవసరాలు వాళ్ళకు ఉంటాయి".

"అవసరాలు అందరికీ ఉంటాయి. కానీ ప్రాణంమీదికొచ్చే అవసరాలు కొందరికే వస్తాయి".

"అందుకని తప్పు చేయాలా? తప్పు కూడా కాదు. నమ్మకద్రోహం!"

నా ఆవేశాన్ని చూసి మూర్తి ముసిముసిగా నవ్వుతున్నాడు.

"పైపై నవ్వులు ప్రాణానికే చేటంటారు. నవ్వకండి మూర్తిగారూ! ఒక్కసారి మీరు చేసిందేమిటో మననం చేసుకోండి. అసలే ఇది జిల్లా కేంద్రం. పగటిపూట ఊపిరి సలుపుకోలేని పని ఉంటుంది. మీ సహ పార్సెల్ క్లార్క్ ఒకవైపు పార్సెల్స్ బుక్ చేస్తూ డెలివరీ ఇస్తూ ఇంకొకవైపు రైళ్ళలో దిగుమతి అవుతున్న పార్సెలు దించుకొంటూ ఎగుమతి చేయవలసినవి చేస్తూ సతమతమవుతూంటే మీరు సహాయం చేస్తానంటూ డెలివరీ సీట్లో కూర్చున్నారు. నిజంగా సహాయం చేస్తున్నారని సహ ఉద్యోగి కదా అని నమ్మి అతడు సర్వీసు మీకప్పగిస్తే మీరేంచేశారు?– అతడు డెలివరీ ఇచ్చిన పార్సెల్ రసీదును దానికి సరిపడిన డబ్బును జేబులో వేసుకొని చెక్కేశారు. సాయంకాలం అతడు కాష్ బుక్‌లో రాస్తాడు. ఉన్న రసీదుల ప్రకారం డబ్బు సరిపోతుంది. అతడక్కడికి తాను నిర్వహించిన వ్యవహారం సరిపోయిందని సంతృప్తి పడుతున్నాడు. కానీ మీరు చేసిన ద్రోహంవల్ల అతడు డెలివరీ ఇచ్చిన పార్సెలు చార్జీలు రైల్వేకి చెందవలసింది మీ జేబులోచేరాయి".

"చిన్నవాడివి. నా పరిస్థితులు వివరించినా నీకు అర్థం కావు. కేవలం వాళ్ళు డెలివరీ వేసిన పార్సెలు డబ్బుల్నే నేను వాడుకొన్నాననుకొంటున్నావ్! అవసరం వస్తే నా డ్యూటీలో కూడా అదే పని చేశాను. అయినా వారం రోజుల తర్వాత ఆ డబ్బు మళ్ళీ చెల్లిస్తూవచ్చాను కదా?"

"రైల్వే డబ్బును తాత్కాలికంగా కూడా వాడుకోవడం నేరం. అందుకే పట్టుబడ్డారు. కానీ మీరు చేసిన తప్పు ఉద్దేశపూర్వకంగా!– ఇతరులవల్ల ఆ తప్పు జరగడానికి కొంత మీరు కారణం. మరికొంత వాళ్ళ అజాగ్రత్త కారణం. 'అయితే నేను పదిసార్లు ఉద్దేశపూర్వకంగా చేసినా ఇతరులవల్ల ఒక్కసారే అజాగ్రత్తవల్ల జరిగినా తప్పు తప్పే కదా!' అని మీరు వాదించారు. అందువల్ల గత అయిదేండ్లుగా ఈ స్టేషన్‌లో పనిచేసిన పదమూడు మంది ఈ రొంపిలో కూరుకపోయారు. మీరు చేసిన తప్పుకు ఇతరుల్ని బలిచెయ్యడం న్యాయమేనంటారా?"

"న్యాయమని చెప్పలేను కానీ మంది ఎక్కువైతే మజ్జిగ పలచనైనట్లు అపరాధుల సంఖ్య ఎక్కువయ్యేకొద్దీ దండన తగ్గిపొయ్యే అవకాశం ఉంది. అందుకే చాలాజాగ్రత్తగా ఆలోచించి ఇంతమందిని ఇరికించాను".

"మీ ఆలోచన బాగానే ఉంది. కానీ ఈ పార్సెల్ ఆఫీసులు... ఈ డబ్బు గొడవలకు... నాకు ఎలాంటి సంబంధం లేదు కదా? నేను బుక్కింగ్ క్లార్క్‌ని. పాషా ఇచ్చిన ముప్పావలా మీ చేతికిచ్చింది వాస్తవమే కదా? మరి వాస్తవాన్ని వాస్తవంగా అంగీకరించడానికి ఇబ్బందేముంది?"

"ఒక్కటే ఇబ్బంది!"

"ఏమిటది?"

"ఈ ఒక్క విషయాన్ని నేను ఒప్పుకుంటే నువ్వూ, పాషా ఇద్దరూ ఇందులోనుండి తప్పుకొంటారు. అప్పుడు నా పక్షం బలహీనమైపోతుంది. బలహీనుడికెప్పుడూ అన్యాయం జరగడం సహజం. తెలిసితెలిసి అన్యాయం జరుగుతూఉంటే నేను సత్యాన్ని పట్టుకొని వేలాడలేను. నా స్వార్థం నాది".

"నిరపరాధులైన ఇద్దరు అమాయకుల్ని నీ స్వార్థానికి బలి చెయ్యాలనుకొంటున్నావ్?"

"బలే అవుతారో? అందరూ కలిసి బయటే పడతామో? ఆ సంగతి ఇప్పుడు నిర్ణయించలేం కదా? విచారణ జరగనీ!"

"అప్పుడు చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకొన్నట్లవుతుంది? నీ చేతులు పట్టుకొంటాను. నన్నీ రొంపిలో దించకు మూర్తీ!"

"మిమ్మల్నందర్నీ ఈ రొంపిలో కీడ్చకపోతే నేనీ రొంపిలో నుండి బయటపడలేను!"

అతనివైపు నుండి ఆలోచిస్తే అతని వాదన కూడా సమంజసంగానే తోస్తున్నది. తాను ఉద్దేశపూర్వకంగా చేసినా ఇతరుల అజాగ్రత్తవల్ల జరిగినా తప్పు తప్పే కదా అని నిరూపించి ఆ తప్పు నుండి తప్పుకోవాలని చూస్తున్నాడు. అతని ఆలోచన బాగానే ఉంది. కానీ ఆచరణలో పెడితే?– ఎన్నో జీవితాలు ఏమవుతాయో ఊహించడం కూడా కష్టంగా ఉంది. మనిషి ఇంత స్వార్థంగా ఆలోచించి నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించగలడా? అన్న ఆశ్చర్యం కలుగుతూ ఉంది.

"నీవేమైనా అనుకో! నీవే కాదు ఎవరైనా ఏమైనా అనుకోండి. నా నిర్ణయం నాదే!" అన్నట్లుగా మూర్తి ఎటో చూస్తున్నాడు.

అతని మొగం చూడలేకనో లేక రాయలసీమ మీద అలిగినట్లుగానో మేఘాలు ఆగమేఘాలమీద పరుగులు తీస్తున్నాయి.

'వెళ్ళొస్తాను మూర్తీ!' అని చెప్పడానికన్నా మనస్కరించలేదు. పడమటి కొండల మాటునుండి సూర్యుడు విసిరిన చీకట్ల వలలో మొదట నా గుండె చిక్కుకొన్నట్లుంది. మూర్తి మొగం అప్పుడు కనపడలేదు. ఆ తర్వాత చూడలేదు.

ఆ సంజచీకట్లలో నాదారి నాది అయింది.

* * * *

ఆ మరుసటి రోజు ఉదయం పది గంటలకు విచారణ.

మూడు రైల్వే జిల్లాల నుండి ముగ్గురు అధికార్లు వస్తున్నారు.

ఆ రైల్వే స్టేషన్‌లోని ఫస్ట్‌క్లాస్ వెయిటింగ్ రూమ్ కోర్టు ఆవరణగా మారుతుంది. ఆ కోర్టు ఆవరణలో ఆ ముగ్గురు అధికార్ల ముందు నేను సాక్షిగా నిలబడుతున్నాను.

రైల్వే స్టేషన్‌లో వాతావరణం చాలా గంభీరంగా మారిపోయింది. మనుషుల్ని మంత్రించి వదిలినట్లు యాంత్రికంగా ఎవరి పనులు వాళ్ళు చేసుకొనిపోతున్నారు. ఆరోజు గడిస్తే... ఆ మరుసటి రోజు విచారణ జరిగితే... ఎవరెవరి బతుకులేమవుతాయో? అన్న సందేహం ప్రతి వ్యక్తిని పట్టి పీడిస్తున్నట్లుంది.

ఆ రోజు చాలా భారంగా గడిచిపోయింది.

అపూట డ్యూటీ పూర్తిచేసుకొని నా గదికి బయలుదేరుతున్నాను. పాషా ఎదురయ్యాడు. ఉన్నట్లుండి రెండు చేతులు పట్టుకొన్నాడు. "ఇవి చేతులు కావు భయ్యా!" అన్నాడు. వయస్సులో పెద్దవాడు. సర్వీసు తక్కువేం కాదు. అతడంత మాట అంటాడని నేను ఊహించలేదు. ఏదో షాక్ తిన్నట్లుగా తలెత్తి అతని మొగంలోకి చూస్తే కండ్లు నిండుకు నీళ్ళు. తలవంచాను. వైదొలిగాను. నా గది చేరుకొన్నాను.

ఆ రాత్రి కనురెప్ప తలుపులు మూతపడలేదు!

అపద్ధం చెప్పి నన్ను నేను రక్షించుకోవాలా? లేదు నిజం చెప్పి పాషాను రక్షించాలా? ఏది సముచితంగా తోచలేదు. మధ్యేమార్గం కనిపించలేదు! కండ్ల నిండుకు నీళ్ళు పెట్టుకొని 'ఇవి చేతులు కాదు భయ్యా!' అని చేతులు పట్టుకొన్న పాషా, 'పాణంమింది కొచ్చినా సరే! ఒకరి గుండె గెబీమనిపించద్దు!' అని హితోపదేశం చేసిన మా అమ్మ, 'వాడు కలెక్టరయినా, వాడెమ్మా మొగుడు గవునూరైనా మడక మేడికిందికేరా!' అని జీవిత సత్యాన్ని చాటిన రైతుమూర్తి మా అయ్య ముగ్గురు రంగంలోకి దిగారు. నాతో కలిసి నలుగురు. నా మనో న్యాయస్థానంలో ఆ చీకటి గదిలో... ఎవరి కంటా పడకుండా... వాదోపవాదాలతో ఆ రాత్రంతా విసుగు విరామం లేకుండా గడిపాము.

తూరుపు రేఖలు మైలు విడిచాయి!

రాత్రి నలుగురు ఆడిన నాటకం ముగింపుతో మనసు తేలిక పడింది. ఒక నిశ్చితాభిప్రాయానికి రావడంతో అంతవరకు పడిన మధనంతా మాయమైపోయింది. చక్కగా ముస్తాబై సరిగ్గా పది గంటలకు రైల్వే స్టేషన్ చేరుకొన్నాను.

అప్పటికే స్టేషన్ అంతా హడావిడిగా ఉంది.

నన్ను చూసి చాలామంది వ్యక్తం చేసిన ఆశ్చర్యంతో నేనాశ్చర్యపడలేదు.

విచారణ ఆరంభమయింది!

మూడు దశాబ్దాల కిందట రైల్వే వాళ్ళంటే మంచి పరపతి ఉండేది. వాళ్ళతో పరిచయాలు గౌరవప్రదంగా భావించేవాళ్ళు. అదీగాక ఒక స్టేషన్‌లో అయిదేండ్లుగా పనిచేసినవాళ్ళు ఒక్కసారిగా పదమూడు మంది సస్పెండ్ కావడం అదే ప్రథమం. రైల్వే చరిత్రలోనే అటువంటి సంఘటన అంతవరకు జరగలేదట! ఆసక్తితో ఊళ్ళోవాళ్ళు, రైల్వేవాళ్ళు ఆ వెయిటింగ్ రూమ్ చుట్టూ గుమిగూడారు.

"అయ్యా! అప్పుడెప్పుడో నాలుగైదేండ్ల కిందట జరిగిన పొరబాటు ఇది. అది కూడా ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదు. పూర్తిగా డ్యూటీ వత్తిడిలో దొర్లిన పొరబాటు. ఆ పొరబాటు ఆడిటింగ్‌లో బయటపడినప్పుడు అప్పటికప్పుడే డబ్బు చెల్లించాము. ఈ పొరబాటు ఉద్దేశపూర్వకమైనది కానేకాదు. మమ్మల్ని క్షమించండి". అని దాదాపు అందరూ ఒకేరకమైన పాట పాడుతున్నారు.

మూర్తితో కలిసి పనిచేస్తున్న ఇద్దరు పార్సెల్ క్లార్క్‌లు మాత్రం– మా తప్పేమీలేదు. సహాయం చేస్తానని సహ ఉద్యోగిగా నమ్మించాడు. ఈ నమ్మకద్రోహానికి పాల్పడ్డాడు. ఈ ద్రోహానికి ప్రాయశ్చిత్తంగా ఆడిటింగ్‌లో షార్ట్ రిమిటన్స్‌లన్నీ మేమే చెల్లించాము. మమ్మల్ని కాపాడండి స్వామీ!' అంటూ కాళ్ళావేళ్ళాపడి బతిమాలుతున్నారు.

మూర్తి శ్రద్ధగా వింటున్నాడు. అంతా శుద్ధ అబద్ధమని ఖండిస్తున్నాడు.

నా వంతు వచ్చింది–

పిలుస్తూనే లోనికి వెళ్ళాను. ముగ్గురు అధికార్లకు నవ్వుతూ నమస్కరించాను. వినయంగా నిలబడ్డాను. ఈ బుడంకాయంత బుల్లోణ్ణి చూసి వాళ్ళకు కూడా బోలెడంత ఆశ్చర్యం కలిగినట్లుంది. చాలా మర్యాదగా ప్రతి నమస్కారం చేస్తూ కూర్చోమన్నారు.

కానీ నేను కూర్చోలేదు.

మూర్తి మాత్రం ఆ అధికార్ల ముందు దర్జాగా కూర్చొని ఉన్నాడు. నిండా మునిగిన వ్యక్తికి చలి ఎందుకుంటుంది?

అతన్ని చూడడమే ఏదో పాపం చేసినట్లనిపిస్తూ ఉంది. అందుకే అటువైపు చూపును కూడా తిప్పకుండా నిలబడుకొన్నాను.

ఆ వెయిటింగ్ రూమ్ చుట్టూ చేరిన ఊళ్ళోవాళ్ళు మా రైల్వే వాళ్ళు కిటికీల గుండా నన్ను నిక్కి నిక్కి చూస్తున్నారు. పాషా ఆ గది ద్వారాబంధానికి ఆనుకొని నావైపే చూస్తున్నాడు.

అతని మొగాన కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు!

అంతలో ఉన్నట్లుండి!–

"ఎ.ఎస్.ఎమ్. పాషా నీదగ్గర ముప్పావలా ఇచ్చి మూర్తికి ఇవ్వమన్నారట. నిజమేనా?"– అని ఒక అధికారి ప్రశ్నించాడు.

"నిజమే!"

ఆ మాటంటూ పాషావైపు చూశాను. అతని కన్నులు విరిసిన దిరిసెనలతో పోటీపడ్తున్నాయి. ఆ పువ్వులమీద రాలిన మంచుబిందువుల్లా ఆనందబాష్పాలు!

"ఆ ముప్పావలా మీరేంచేశారు?"

"మూర్తిగారికిచ్చాను!"

"ఏం మూర్తీ?"

"నా చేతికివ్వలేదు"– మూర్తి సమాధానం.

"మీరేమో మూర్తిగారికి ఇచ్చామంటున్నారు. అతనేమో లేదంటున్నాడు. మీరేమంటారు?"

"సార్! ఎ.ఎస్.ఎమ్. పాషాగారు ఎంతోకొంత మొత్తాన్ని– ముప్పావలా అవునో? కాదో? కూడా నాకూ తెలియదు. ఒక ఎర్రని పేపరులో (రైల్వే రసీదు ఎరుపు రంగులో ఉంటుంది) మడిచి మూర్తిగారికిమ్మన్నారు. నేను ఇచ్చాను. దీనికి ఆధారమేమిటని మీ ప్రశ్న?"–

నానుండి ఎదురు ప్రశ్నను ఎదురు చూడని అధికారి నన్నొకసారి ఎగాదిగా చూసి 'అవును!' అన్నాడు కటువుగా

నేను మరింత వినయంగా "సార్! పాషాగారు పదిహేనేండ్ల సర్వీసు కలిగిన అసిస్టెంటు స్టేషన్ మాస్టర్. సర్వీస్ దృష్ట్యా చూస్తే నాకంటే రైల్వే రూల్స్ రెగులేషన్సు అతనికే బాగా తెలిసి ఉండాలి. నా చేతికిచ్చిన డబ్బు రేల్వేకి చెందినదైతే తప్పకుండా ఆయన నా దగ్గర సంతకం తీసుకొనే ఆ డబ్బు నాచేతికిచ్చేవారు. నేనూ మూర్తిగారి దగ్గర సంతకం తీసుకొనే ఆ డబ్బును ఇచ్చి ఉండేవాణ్ణి. బహుశా పాషా మూర్తిగారి దగ్గర చేబదులుగా తీసుకొన్న డబ్బేమో అది అన్న దృష్టితో నేను వీళ్ళిద్దరి మధ్య వ్యవహరించినానే తప్ప అది రైల్వే డబ్బు అన్న దృష్టి నాకు లేదు. పాషాగారు చెప్పలేదు. నేను డబ్బు తీసుకొన్నదానికి సంతకం చేయలేదు. ఇచ్చిన దానికి సంతకం తీసుకోలేదు. కానీ పాషా నాదగ్గర ముప్పావలా ఇవ్వడం నేను డబ్బును మూర్తిగారికిచ్చివేయడం మాత్రం సత్యం!"

బహుశా ఇలాంటి సమాధానాన్ని ఆ ముగ్గురు అధికార్లు నానుండి ఊహించలేదేమో? చేష్టలుడిగి ఆశ్చర్యంగా నావైపు చూస్తున్నారు.

"ఏంవో అనుకుంటా ఉంటిమే? పిల్లనాయాలు బలే బాగా సెప్పినాడే!" వెయిటింగు రూం చుట్టూ గుమిగూడిన జనం నవ్వుకుంటూ అనుకొంటున్న మాటలు వినపడుతున్నాయి.

"ఈ రైల్వే ఉద్యోగంలో ఎందుకు చేరావయ్యా? అడ్వకేట్‌గా అయితే గొప్పగా రాణించేవాడివి", ప్రశంసాపూర్వకంగా అభినందిస్తున్నాడు వాళ్ళలో ఒక అధికారి.

"మీ మాటలు మేము విశ్వసిస్తున్నాం. ఇందులో మీ తప్పేమీ లేదు. ఇక మీరు వెళ్ళవచ్చు!" ధర్మపీఠాన్ని అధిష్టించిన న్యాయమూర్తిగా ఆదేశించాడు ఇంకొక అధికారి.

కొన్ని నిముషాలకు ముందు అధికారం అడుగులకు మడుగులు వత్తిన నా మనసు ఆ నిర్ణయంతో తెగువమీరింది. నా నిర్ణయం కంటికి ఆ ముగ్గురు అధికార్లు చాలా సామాన్యులుగా కనిపిస్తున్నారు. ఇప్పుడు ఆ అధికార్ల ఎదుట ఎంతో దర్జాగా కూర్చున్నాను.

"సార్! దయచేసి అంత కాగితం ఇవ్వండి!"

అధికారులకు నామీద ఏర్పడిన సదభిప్రాయం నోళ్ళు మూయిస్తే ఒక తెల్ల కాగితం చేతులు మారి నా చేతిలో ఉంది.

ఈ చేత్తో అందుకొని ఆ చేత్తో ఇచ్చినట్లుగా మళ్ళీ ఆ కాగితాన్ని ఆ అధికారి చేతికి ఇచ్చాను.

కాగితాన్ని అందుకొన్న అధికారి నావైపు తెల్లబోయి చూస్తున్నాడు.

"సార్! ఈ వాస్తవాన్నే ఇలా తిప్పి చెప్పకపోయి ఉంటే నేను దోషిని. ఇప్పుడు నిర్దోషిని. ఎప్పుడో ఒకప్పుడు ప్రాణం మీదికొచ్చినప్పుడు అబద్ధం చెప్తే తప్పులేదు అన్న రోజులు గతించాయి. ఎప్పుడో ఒకప్పుడు నిజం కూడా చెప్పొచ్చు అన్న రోజుల్లో బతుకుతున్నాం. చెమటోడ్చి బతికే బతుకులు మాటల్ని మార్చి బతకడం కష్టం. అది కత్తిమీద సాము. అందుకే సార్ నా రాజీనామా!"

ముగ్గురు అధికార్లు ఇంకా ఆశ్చర్యం నుండి తేరుకోలేదు.

'నా కడుపున సెడబుట్టలేదురా?' అని మా అమ్మ– 'ఇప్పుడబ్బోడా? నువ్వు నా కొడుకు!' అని మా అయ్య నా ఎదుట నిలబడి నన్ను దీవిస్తున్నట్లుంది.

'కలెక్ట్రయినా వాడెమ్మా మొగుడు గవునూరైనా మేడిపిడి కిందికేరా!" అన్న మా అయ్య మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తూంటే మేడిపిడి కనులముందు మెదిలింది.

ఆ మేడిపిడి– మా అయ్యకు ఆ అధికారులకు మధ్య గీచిన సరిహద్దు రేఖలా ఉంది. ఆ రేఖకు పైన మా అయ్య ఎంతో ఉన్నతుడుగా కనిపిస్తూంటే– అంతవరకు ఎంతో ఉన్నతులుగా కనిపించిన ఆ అధికార్లు మేడిపిడి కిందికి వొదిగిన మరుగుజ్జుల్లా కనిపిస్తున్నారు.

అప్పటి నా ఆనందానికి ప్రతీకలు మా ఊళ్ళో పచ్చని పైరు పొలాలు... ఆ పొలాలమీద స్వేచ్ఛగా రెక్కలు విప్పి ఎగురుతున్న పాలపిట్టలు! ●

ఆంధ్రప్రభ
(14, జనవరి 1987)